అనుకోకుండా ఊరెళ్లిన కుటుంబం... అనుకోకుండా వొచ్చిన శలవు... తోచనివ్వని ఒంటరితనం. అందరిలా అవతలకి పోయి అందరినీ చూస్తూ తిరగడానికనుమతించని ఉద్యోగపు కోడ్ ఆఫ్ కాండక్ట్. అలాగ ప్రవర్తనా నియమావళి విధించిన ఏకాంతపు చెరని ఎలా తరించాలా అని ఆలోచిస్తూ... యింటి ముందరి లాన్‌లో కుర్చీ, టీపాయి వేయించుకుని టీ తాగి... సిగరెట్ కాలుస్తూ... ఆ పొగ నర్తకిలా వొంపులు తిరుగుతూ... వయ్యారాలు పోతూ... పైకి పోతూంటే చూస్తూ... ఆ సిగరెట్ పొగలో ఒక స్త్రీ ఆకృతి గోచరించేసరికి... దానిలో ఏవో



# కోర్టుకెక్కని కేసు

పోలికలు కనిపించి... జ్ఞాపకాలు రేపేసరికి... వాగ్దానాలు గుర్తు చేసేసరికి జడ్జి జగన్నాథ రావ్‌లో చలనం కలిగింది. మెదడులో గతం మెదిలింది. అతను సిగరెట్ దమ్ముని గట్టిగా పీల్చి... సిగరెట్‌ని యాష్ ట్రేలో నొక్కేశాడు. పదిరోజుల కిందట... ఆదివారం... యిలాగే... సాయంత్రం. అప్పుడూ కుటుంబం లేదు. ఒంటరిగా లాన్‌లో కూర్చుని శూన్యంలోకి చూస్తూంటే –

"నమస్కారం..."

త్రుళ్లిపడి చూశాడు. ఎవరో స్త్రీ.

"మీరెవరు?" సర్దుకుని... స్వరంలోకి గంభీరతని అరువు తెచ్చుకుని అడిగాడు.

"నాపేరు... భారతి. మిమ్మల్ని కలుసుకోవాలని..." ఆమె చేతులింకా విడలేదు నమస్కార భంగిమ నుంచి.

"చదువుకున్నవారిలాగే కనిపిస్తున్నారు..."

"పోస్టు గ్రాడ్యుయేట్‌ని. కానీ... ఏం లాభం? ఆడదాన్నీ, అర్ధాంగినీ, అసహాయనీ..." ఆమె కళ్లల్లో నీళ్లు... తనలో ఆమెపట్ల జాలీ, కుతూహలమూ కలిగినా – నిగ్రహించుకుంటూ...

"చదువుకున్న మీకు – మెజిస్ట్రేట్‌ని యింటి దగ్గర కలుసుకోకూడదని తెలిసుండాలి. కోర్టుని యింటికి తీసుకురావడానికి మా ఉద్యోగ ధర్మం అంగీకరించదు" అన్నాడు.

ఆమె దోషిలా తలవొంచుకుని... "మీ ప్యూన్‌కి – నేను మీ బంధువునని అబద్ధమాడి వొచ్చాను. సర్! మీరు మేజిస్ట్రేటు... అయినా సమాజంలో భాగస్వాములే కదా. సాటి మనిషికి ఉపకారం చేయడం – మీ బాధ్యతే కదా... నేను పెద్ద మాటలు మాట్లాడితే క్షమించండి. మీరివ్వబోయే తీర్పుని ప్రభావితం చేయాలని రాలేదు. అసలు... నాకేసు కోర్టుకే రాలేదు. మేజిస్ట్రేటుగా మానవ మనస్తత్వంతో... మానవుల సమస్యలతో... వారి ప్రవృత్తులతో నివృత్తులతో మీకెంతో పరిచయముంటుందనీ... నా సమస్యకు మీరు పరిష్కారమార్గం సూచించగలరనీ పుట్టెడాశతో వొచ్చాను. ఎందరో లాయర్లు ఏమీ చెప్పలేకపోవడంతో... లాయరు కంటే జడ్జి ఎక్కువ మేధావవుతారనీ... పద్ధతుల కంటే ధర్మమే ప్రధానమని భావిస్తారనీ... మానవసేవనే తన విధిగా భావిస్తారనీ... మీరు కవి కూడా కనుక సరిగా ఆలోచించి, సానుభూతితో

ఇచ్ఛాపురపు రామచంద్రం

నా సమస్యని పరిష్కరించే మార్గం చూపుతార నీ... గంపెడాశతో... అబద్ధమాడి మరీ మీ ముందుకి వొచ్చాను. ఇది తప్పే అయితే - చెప్పండి, వెళ్లిపోతాను -" ఆమె కంఠస్వరంలో వొణుకూ, వేదనా.

తను గతుక్కుమన్నాడు. "నేను కవినని మీకె వరు చెప్పారు?"

అంత దుఃఖంలోనూ ఆమె నవ్వింది. "మను షుల గురించి కొన్ని గుణాలూ నిజాలూ దాగవు. వారికంటే ముందుగానే సమాజంలోకి వొస్తా యి."

అప్పుడు చూశాడామెను కొంచెం పరిశీలన గా. వయస్సు - ముప్పయికి ఒక ఏడాది అటూ యిటూగా ఉండొచ్చు. సహజంగా అందమైనదే అయి ఉండొచ్చు కానీ... సంవత్సరాల తరబడి నిద్రాహారాలు లేనట్లూ... దెయ్యం ఆవహించో, పిశాచం పీడిస్తూనో నలుగుడికి లోనయిన ట్లూ... అలసిపోయీ, నీరసమూ నిస్పృహా ఆవరించి - కళా, కాంతీ కోల్పోయిన ముఖం తో దీనంగా కనిపిస్తూంది. మానసిక వేదన మండించేస్తున్నట్లు మ్లానమయి ఉంది.

"కూర్చోండి. కొంచెం టీ తీసుకుని మీ బాధ చెబ్దురు గాని." అంటూ ఫ్లాస్కులోంచి టీ పోసి చ్చాడు. ఆమె కూర్చుని... మొహమాటపడు తూనే టీ తాగి... కృతజ్ఞతలు చెప్పి... మొదలు పెట్టింది.

"మావారు ఏవేవో బిజినెస్‌లు చేస్తూంటారు చిన్నా చితకా. రాబడి అంతంత మాత్రమే."

"మీరు పి.జి. చేశానన్నారుగా... ఉద్యోగం చేస్తే - అటు ఆదాయమూ, యిటు విద్యకి సార్థకతా."

"పెళ్లికి ముందు నా ఆలోచనా, ఆశా, ఆకాంక్షా అదే. కానీ... ఈ వ్యవస్థలో ఆడదానికి పెళ్లితో అస్తిత్వమే కాదు... అన్నీ పోతాయి. శారీరకంగా విశ్రాంతి ఉండకా, మెదడుకి పని ఉండకా... మొద్దులా తయారుచేయబడుతుంది - మొగుడి చేత." మాటలనిండా కసి.

"మీకు సంతానం..." ఉన్నారా అన్నట్లు చూశాడు.


"ఆ ఒక్క విషయంలోనూ మాత్రం దేముడు కరుణించాడు. పిల్లల నివ్వక మేలు చేశాడు, భర్తనిచ్చి కీడుచేసినా." ఒకసారాగింది. "మావా రు త్రాగుతారు... విధిగా. స్కాచ్‌విస్కీ ఐతేనేం, మరొకటయితేనేం... ప్రతిరాత్రీ పదినుంచి ఒంటిగంట వరకూ మా యిల్లొక సారా దుకా ణం."

"ఈరోజుల్లో తాగుడు సర్వసాధారణమై పోయింది. గొప్పతనమూ, మగతనమూ, నాగరి కతా అయింది."

"నా సమస్య తాగుడు కాదు" స్థిరమైన కం ఠంతో చెప్పింది భారతి. "అతని వాగుడు -"

"అంటే?" ఆశ్చర్యంగా చూశాడు.

"తాగే సారాలో సోడా లేకపోయినా ఫరవా లేదు కానీ, తాగి అతను వాగే వాగుడు వినడా నికి శ్రోత మాత్రం తప్పకుండా ఉండాలి. కరు ణాకర్ నన్ను పెళ్లి చేసుకున్నది అందుకేనట. అతనే చెప్పాడు... పెళ్లి కాకముందు అతను తన శ్రోతకి తనవాగుడు వినేందుకూ రుసుము చెల్లించవలసి వచ్చేదట. తనతోపాటు తాగుడు పోయించవలసి వచ్చేదట. దమ్మిడీ కల్లుతాగి యిల్లంతా ఉమియడమంటే అదే. దమ్మిడీ కోతికి ఏగాని కల్లు... అన్న సామెత కరుణాకర్ పట్ల అక్షరాలా నిజం. తాగాక - తల్లీ పెళ్లాల తారతమ్యం తెలియదంటారు. అదేమో కానీ




తాగాక వాగే వాగుడికి వివేకమూ, విచక్షణా, మానవత్వమూ ఏమీ ఉండవు. అందులోనూ అతని అర్థం పర్థంలేని వ్యర్థపు వాగుడు వినాలంటే - తక్కువ కష్టమేమీకాదు. డబ్బుకి కక్కుర్తిపడి నెల్లాళ్లు అతని వాగుడు విన్నందుకు - యిద్దరు పిచ్చాసుపత్రిలో ఉన్నారని విన్నాను."

"తాగాకా తూలడమూ, తూగడమూ, వాగడమూ సామాన్యమే.... సహజమే. సాధారణమే." అని -

"అతనేం వాగుతాడు?" అని అడిగాడంతే.

ఆమె అతని కళ్లముందు ఒక సీన్‌ని ప్రత్యక్షం చేసింది అతి ప్రతిభావంతంగా... కళ్లకి కట్టేటట్టు.

* * *

సమయం - రాత్రి పదిగంటలు దాటింది. స్థలం - ఒక గది. ఆవరించిన డిమ్‌లైట్‌లో ఒక టీపాయి. దానిముందు కుర్చీలో ఒక మగవాడు. టీపాయిమీద ఒక పెద్దసీసా... పక్కన నీళ్లసీసా. పళ్లెంలో మిరపకాయ బజ్జీలూ, గోంగూర పచ్చడీ. గ్లాసు... దానిలో పానీయం. టీపాయి ఎదురుగా... మరొక కుర్చీ. దానిలో ఆమె. అతను గ్లాసెత్తి నోటిలో పోసుకున్నాడు. పచ్చిమిరపకాయ బజ్జీని గోంగూర పచ్చడితో అద్ది - నమిలి... సిగరెట్ అంటించి... పొగని ఆమెమీదకి ఊదుతూ-

"భారా!" గంభీరంగా పిలిచాడు ఆకాశంలోకి వయా కిటికీ - చూస్తూ.

ఆమె తలబాదుకుంది. భారతి అనే చక్కని పేరుకి ఏం గతి పట్టించావు? పోన్లే. నీకు 'యా'వత్తు పలకక భార్యా! అనబోయి తిమ్మిరి నాలుక 'భారా' అందనుకుంటాను... అని మనసులో అనుకుంటూ.

"నీ కళ్లకెలా కనిపిస్తున్నానో కాని... నేను చాలా గొప్పవాడ్ని సుమా. నా గ్రేట్‌నెస్‌ని అర్థం చేసుకోడానికి నీ సమర్థత చాలదు. నన్ను భర్తగా పొందడం నీకు నిజంగా చాలా అదృష్టం-"

ఔనౌను... ఇలాటి తాగుబోతూ కలల కిరీటీ దొరకడం చాలా శాపమే. నీ అసలు స్వరూపం లో ఆవగింజంత తెలిసినా - పెళ్లికి ముందు పసిగట్టగలిగినా... సరే... గతజలసేతుబంధనం ఎందుకు? జరగవలసిన నష్టమంతా జరిగి పోయిందిగా.

"తొందరలో నేను వ్యాపారం పెంచేస్తాను. మల్టీనేషనల్ కంపెనీగా... వరల్డ్‌నే శాసిస్తుంది నా కంపెనీ. బిజినెస్ మోనార్క్‌గా వరల్డ్ ట్రేడ్‌ని నేనెంత చెబితే అంత అనేలా కంట్రోల్ చేస్తాను. జి.కె. అంటే బిజినెస్ కింగ్.. ఈ కరుణకుమా ర్‌కి తిరుగుండదు. బిల్‌గేట్స్ నా ఆఫీసుగేటు ముందు పిల్లిలా నిలుచోవలసిందే. ప్రెసిడెం టాఫ్ అమెరికాని పోరా... అనేస్తాను."

ఇంకొంచెం సారా తాగితే సర్వేశ్వరుణ్నే పోరా అనేస్తావు.

"పారిస్‌లో పాలెస్‌లు... బ్రిటన్‌లో భవనా లు..."

పాలవాడి బాకీ తీరిస్తే అదే పదివేలు - ఆమె.

"ఛార్టర్డ్ ప్లేన్‌లో తప్ప చెక్కర్లు కొట్టను."

చాకలాడికి బాకీ పెట్టకపోతే చాలు - ఆమె.

"నా దగ్గర పని చేయాలంటే కనీసం కోటీ శ్వరుడై ఉండాలి."

పనిమనిషికి జీతం సరిగా యిస్తే... భారతి గొణుగుడు.

"నా రొటీనెలా ఉంటుందో తెలుసా? బ్రిట న్‌లో బ్రేక్‌ఫాస్ట్... వెన్నిస్‌లో టెన్నిస్... లండన్ లో లంచ్... ఈజిప్ట్‌లో ఈవెనింగ్..." తాగుబో తు పేలాపన. ఆమెకి నిద్రవొచ్చేస్తూంది. అత వది చూసి -

"భారూ! నీ కళ్లకి ఎలా కనిపిస్తున్నానో కానీ నేను చాలా గొప్పవాణ్ని. నా గ్రేట్‌నెస్‌నర్థంచేసు కోడానికి నీ శక్తి చాలదు. నన్ను భర్తగా పొందడం... నీ అదృష్టం... తొందరలో నేను వ్యాపారం పెంచేస్తాను... వరల్డ్ ట్రేడ్ నేనెంత చెబితే అంత. బ్రిటన్‌లో భవనాలన్నీ నావే..." అంటూ మరోసారి... మరోసారి...

ఇంకొకసారి వినడానికి విసుగొచ్చి... "ఎం దుకన్నిసార్లు అదే చెబుతారు? ఒకసారి చెప్తారు చాలదూ?" అనెయ్యకుండా ఉండలేకపోయాడు.

కంఠంలో కొంచెం కోపం ధ్వనించిందేమో. భారతి నవ్వింది-" క్షమించండి. నా బాధ మీకు సరిగా అర్థమవాలనే తప్ప మిమ్మల్ని విసిగించా లని కాదు. అలా పాడిందే పాడినట్లు పదేపదే చెప్పడం... దయచేసి కొంచెం ఆలోచించండి. ఈపాటి మేరకే... మీవంటి వారికే చికాకేసింది కదా... నాలాటి దానిసంగతి ఏం చెప్పాలి?

రాత్రి పదవుతూంటుంది. ఒకవేపు కళ్లమొ య్యా నిద్రవొచ్చేస్తూంటుంది. అప్పుడు అతను కల్లు పాక తెరిచినట్లు తనతాగుడు దుకాణం మొదలుపెడతాడు. శుభ్రంచేసిన టీపాయినే మళ్లీ తుడవమంటాడు. కడిగిన గ్లాసునే కడగ మంటాడు. మంచింగ్‌కి పచ్చడి చెయ్యమం టాడు. అదంటాడు.. ఇదంటాడు. పెళ్లాన్ని కనక అన్నీ చేస్తాను చచ్చినట్లు. ఒక రౌండు తాగుతాడు. రెండో రౌండ్ నుంచీ వాగడం మొదలుపెడతాడు. సిగరెట్ పొగ నామొహం మీదకి వదులుతాడు, నీకు నిద్ర రాకుండా ఉం డడానికంటూ. సారా వాసనా, సిగరెట్ కంపూ నాకు పరమ అసహ్యం. కానీ... తాళి కట్టించు కున్నాను కనుక తలవొంచి భరించక తప్పదు. నిజంగా దుర్భరమేమిటంటే అతని తాగుడు ప్రగల్భాలు, మార్పులేని ఆ ఆత్మప్రశంసలు గంటకి పది చొప్పున రాత్రికి ముప్ఫయిసార్లు. పెళ్లయి రెండున్నర సంవత్సరాలు. ఒకవేపు

నిద్ర... మరో వేపు - మార్పులేని మాటల రికార్డులు. జడ్జిగారూ! దయతో ఆలోచించండి. అర్థం పర్థంలేని తాగుబోతు పేలాపనలూ... అసాధ్యాలూ... అసంభవాలూ... అదేపనిగా... మార్పుకూడా లేకుండా... వినవలసి రావడం ఎంత నరకమో ఒక్కసారాలోచించండి. అదే గది... అదే సమయం... అవే మాటలు... ముందుగా తెలిసిన హింస. రాత్రవుతూందంటే నాకెంత భయమేస్తుందో. ఆ హావాలు, దర్పాలు, కోతలు. పంతాలు. పొగడ్తలు... నా మెదడుని తినేస్తూ పోతున్నాడు. నన్ను దీనినుంచి తప్పించే దారి చూపండి. నా బాధ అర్థం చేసుకోండి, ప్లీజ్..." ఆమె భోరున ఏడ్చేసింది.

తను బిత్తరపోయాడు - ఆమె మాటలకి. ఆమె దినదినమూ గడుపుతున్న నరకాన్ని ఊహిస్తుంటే "ఆ మాటల కంటే - దెబ్బలు నయం. శరీరానికే తప్ప మనసుకి తగలవు.

నా సహనం చచ్చిపోతూంది. బుర్ర చెడిపోతూంది. మరి కొన్నాళ్ళిలాగే సాగితే నాకు పిచ్చెక్కడం తథ్యం..."

"నేనీ హింసను అర్థం చేసుకోగలుగుతున్నాను. నీ పరిస్థితిమీద నాకు జాలి వేస్తూంది..."

"అన్నయ్యలాంటి వారని చెప్పుకుంటున్నాను. శోభనం గదిలోనే మొదలయింది అతని వాగుడు. నేను షాకయ్యాను - అతను నన్ను పెళ్ళి చేసుకున్నదే ప్రతిరాత్రీ తన తాగుబోతు మాటలు వినడానికే అని చెప్పేసరికి. కానీ... పెళ్లీ... మెడలో తాడూ... తప్పించుకోలేనివి కదా ఆడదానికీ వ్యవస్థలో? పుట్టిల్లు - మొదటే ఊసరక్షేత్రం. అక్కడ నాకు ఆర్థికంగా కాని హార్దికంగాకాని ఆశ్రయమూ ఉండదు, రక్షణా ఉండదు. నన్ను వొదిలేసుకున్నారుకదా నా వాళ్లు... సర్! భరించేవాడు భర్త అన్న నిర్వచనం శుద్ధతప్పు. యీరోజుల్లోను, యీ వ్యవస్థలోనూ మొగుడి మలినాలని, మూర్ఖత్వాన్నీ అన్నిటినీ భరించేది భార్య. చివరకతని సొల్లు వాగుడుని కూడా."

"అతని నస నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నించారా ఏమైనా?" అడగలేక అడిగాడు.

"చెవుల్లో దూది కుక్కుకుని, చెంపల మీదకి జుట్టులాక్కుని... అతని మాటలు వినపడకుండా చీర కొంగు కప్పుకున్నాను. అంతే... 'నిన్ను పెళ్లి చేసుకున్నది నా మాటలు వినడానికే అని కార్యం గదిలోనే చెప్పాను. మొగుడి మాటలు వినలేనిదానివి... నువ్వేం పెళ్లానివి? ఏమిటా నిద్రకళ్లు? భర్తకంటే ముందు నిద్రపోతావా! సిగ్గులేదూ? నాతిచరామని పెళ్లిపీటల మీద చేసిన వాగ్దానాని కర్థం తెలుసా? మళ్లీ పోస్ట్ గ్రాడ్యుయేట్‌నంటావు..." అంటూ చెంప ఛెళ్ల మనిపించాడు."

తన చెంపే ఛెళ్లుమనిపించినట్లయిందామె అలా చెప్పేసరికి. భారతి మీద ఎంతో జాలి వేసింది.

"ధ్యానంలోకి వెళ్లిపోతే అతని వ్యర్థ ప్రలోపాలూ అవీ మనసు కంటవని - ఆ ప్రయత్నమూ చేశాను. అదీపడలేదు. అతన్ని సైకియాట్రిస్టు దగ్గరకి రమ్మని బతిమాలాను.

"నీకే పిచ్చి... భార్యగా ఎలా ప్రవర్తించాలో తెలియని పిచ్చిముండవి. నోరుమూసుకు పడుందు" అనేశాడు. ముల్లుని ముల్లుతోనే తియ్యాలన్న సామెత గుర్తుకొచ్చి - కరుణాకర్ కంటే ముందు నేనే వాగుడు మొదలుపెట్టబోయాను. అతను నా నోరు నొక్కేసి- "మొగుడు చెప్పేది పెళ్లాం వినాలికాని, పెళ్లాం చెప్పేది వినే కొజ్జా మొగుణ్ని కానునేను" అంటూ నాలుగు తన్నాడు.

క్రూయల్టీ... గొణుక్కున్నాడు తను.

"మాటలు వినడమే కదా నీ సమస్య అని తేలికగా అనిపించవచ్చు పైవాళ్లకి. కానీ... అనుభవిస్తే తెలుస్తుంది అదెంత నరకమూ, చిత్రహింసో. అతను – తాగకపోతే వాగలేడు. తాగేది వాగడం కోసమే. అదేం ఆనందమో... నేనీ బాధ యిక అట్టే కాలం భరించలేను. ఏ బలహీనక్షణంలోనో – తెగించి... అతన్నయినా చంపేస్తాను, నేనయినా చస్తాను. నా మానసిక పరిస్థితి అలా ఉంది. సత్వర పరిష్కారం కావాలి నాకు. జస్టిస్ డిలేడ్ యీజ్ జస్టిస్ డినైడ్... ఇక్కడ... యీ సమస్యలో... ఆలస్యం ఖరీదు ఒకప్రాణం కావచ్చు."

"సరే... మీరు ఫిర్యాదు రాసివ్వండి. నేను చేయగలిగినదంతా చేస్తాను." వాగ్దానం చేస్తున్నట్లన్నాడు.

"కానీ... నేను... కేసు పెట్టలేను, కోర్టుకీ వెళ్లలేను. నా పరిస్థితి..."

"నేనర్థం చేసుకున్నాను. ఈ ఫిర్యాదు రచ్చకెక్కదు. ఐనా ఉండాలి. అన్నట్లు... మీవారు – ప్రస్తుతం కాని, గతంలో కాని... రాజకీయ నాయకుడు కాని, కవికాని, టీచరు కాని..."

"ఏమీకారు. ఆయనే ఉంటే మంగలెందుకన్నట్లు ఆపాటి గొప్పతనమే ఉంటే యితరులచేతే పొగిడించుకోబడేవాడు కానీ స్వకపోలమర్దనానికెందుకు పూనుకుంటాడు? డబ్బిచ్చి మరీ తన వాగుడుకి శ్రోతలనెందుకు కొనుక్కుంటాడు?"

"సరే... ఫిర్యాదులో యింటి అడ్రసు స్పష్టంగా రాశారు కదా?"

"ఆ..." అంటూ అందించిందామె. అతను చదివి సరిపోతుందన్నట్లు తలపంకించి – "ఇక మీరు వెళ్లండి. నిజానికిలాంటి కేసులు నాకే కాదు, మన దేశానికీ కొత్తే. అరుదే. అమెరికా లాంటి దేశాలకయితే యిలాటివి మామూలే. సాధ్యమైనంత తొందరలో పరిష్కారం లభిస్తుందని ఆశిస్తాను." అన్నాడు.

ఆమె నమస్కారం చేసి వెళ్లిపోయింది.

*　*　*

మాటయితే అనేశాడు కానీ భారతి సమస్యని ఎలా పరిష్కరించాలో అర్థం కావడంలేదు. ఆమె పరిస్థితి గురించే ఆలోచిస్తూ... ఆకాశంలోకి, సిగరెట్ పొగలోకీ చూస్తూ...

"సర్!" వినయపూర్వకమైన పిలుపు విని – పక్కకి చూశాడు జగన్నాథరావ్. బెంచిక్లర్క్ "మీకోసం ముగ్గురొచ్చారు సర్. కోర్టు పని కాదు. కవితా సభ నిమిత్తం. నేను కవిత్వం చదువుతుంటానని తమరికి తెలుసు. ఈ ముగ్గురికీ మూడు సాహితీ సంస్థలున్నాయి. రేపు మూడు సంస్థలూ ఒకే కవిగారికి మూడు సభలు విడివిడిగా ఏర్పాటు చేసి సన్మానిస్తాయిట. ఆ మూడు సభలకీ మిమ్మల్ని అధ్యక్షులుగా ఉండమని కోరడానికి వొస్తున్నారు. నా కవితలు చదవడానికి ముగ్గురూ అవకాశం యిస్తుంటారు కనుక కాదనలేక తీసుకొచ్చాను" అన్నాడతను వినయంగా. జడ్జిగారు అతని ముఖం చూసి అంగీకరించినట్లు వారిని తీసుకురావడానికనుమతించారు. ప్యూను కుర్చీలు తెచ్చాడు. వాళ్లు వచ్చారు. నమస్కారాలూ అవీ అయ్యాక "మా బెంచి క్లర్కు చెప్పాడు మీ రాకకి కారణం. మీరు ఒకేవూరిలో మూడు సంస్థలెందుకు పెట్టారూ పోటీలాగ? మూడు వేర్వేరు మీటింగులటగా? ఒకేపాటకి మూడు రాగాలన్నట్లు ఒకే కవిగారికి ఒకే వేదికమీద మూడు సన్మానాలేమిటి ఒకే రోజున?"

"సర్! పోటీవల్ల ప్రతిభ పెరుగుతుందని

మేము బయటికి చెప్పే కారణం..." "ఈవూళ్లో రెండు పార్టీలూ, ఇండిపెండెంట్లూ. మూడు విభాగాలకీ ప్రతినిధుల్లా మూడు సంస్థలు–"

"పైకి మేము ప్రత్యర్థులం కాని.. నిజానికి మేము ఫ్రెండ్సమే. లేకపోతే అదే వేదికమీద అదే కవికి తొమ్మిది నుంచి పదకొండు; పన్నెం డు నుంచి రెండు; మూడు నుంచి ఐదు వరకూ సభలెలా నిర్వహించగలం?"

మీరు ముదుపు కవి కనుక.. అధ్యక్షత వహించవలసిందిగా ప్రార్థిస్తున్నాం."

హఠాత్తుగా ఏదో ఆలోచన మెరిసినట్లు – "మీకు – ఒక బుర్ర కావాలా, మూడు బుర్రలు కావాలా మీటింగులకి? అధ్యక్షతకయితే నేనొక్క డినే వస్తాను. అలాకాక ప్రేక్షకులుగా అయితే ముగ్గురిని పంపిస్తాను. నిర్మొహమాటంగా చెప్పండి... నేనేమీ అనుకోను. వేదిక మీద మనిషి ఒకరు కావాలా, ప్రేక్షకుల్లా... మొదటి నుంచి చివరి వరకూ, వందన సమర్పణ కూడా వినే ప్రేక్షకులు ముగ్గురు కావాలా?" ఊరిస్తు న్నట్లే అడిగారు. వాళ్లలో ఒక్కసారి ఉత్సాహం ఉప్పొంగింది.

"మీరు ఏమీ అనుకోనని భరోసా యిచ్చారు కనుక నిర్మొహమాటంగా చెబుతున్నాం. వేదిక మీద మేము కూర్చుంటామంటే మేము కూర్చుం టామంటూ ఎందరో పోటీ పడిపోతూ మాకు తలనొప్పి, సమస్యా తెస్తున్నారు. కానీ... ప్రేక్షకు లుగా వొచ్చేందుకెవరంటే వారే కుంటి సాకులు చెప్పేస్తున్నారు. స్వీయ కవితా పఠనం లేదు కనుక కవులు కూడా సభకి రామనేస్తున్నారు. ముగ్గురు ప్రేక్షకులని యిస్తే అంతకంటే కావల సిందేముంది? మీకు చాలా ఋణపడి ఉంటాం." అన్నారు. క.స.(కవిత్వ సమితి), న.స.( నగర సమితి), బి.సా. (బిక్కప్రోలు సాహితీ సమాఖ్య). కార్యదర్శులు.

"సరే... మీరు వెళ్లండి. మీరిచ్చిన టైముకి మాముగ్గురు ప్రేక్షకులూ సభలో ఉంటారు." అని వారిని పంపి వెంటనే సబ్ఇన్స్పెక్టరాఫ్ పోలీస్ (ఎస్.ఐ.) కి ఫోన్ చేశారు జడ్జి.

* * *

ఆదివారం... ఉదయం... ఎనిమిది దాటిం ది. సాలిటరీ సెల్ (ఒక్కఖైదీయే ఉండే బందికా నా)లో బిక్కచచ్చిపోయి ఉన్నాడు కరుణకుమార్. అతనికేమీ అర్థంకావడం లేదు. నిన్న– చీకటి పడుతూన్నవేళ... యిద్దరు కానిస్టేబుల్స్ వొచ్చి – "ఎస్సయ్‌గారు రమ్మన్నా"రంటూ తను అడిగే ప్రశ్నలు వినిపించుకోకుండా... బలవంతంగా యీడ్చుకొచ్చి స్టేషన్‌లో పడేసి, మరిక తన ముఖం చూడలేదు.

గదిలో– చీకటి... కంపు... దోమలు... ఒంటరితనం... ఎందుకిలాంటి చోట పడేశారా అనే ప్రశ్న... అవన్నీ ఒకెత్తు అయితే రాత్రి... మందు లేదు... తిండిలేదు... అన్నిటికంటే ముఖ్యంగా మాటలు వినడానికి మనిషిలేదు! రాత్రంతా నిద్రలేదు. ఎంతో నీరసంగా ఉంది.


కరుణాకర్ అలా ఆలోచిస్తూంటే... యిద్దరు మనుషులు... మామూలు బట్టల్లోనివారు... వొచ్చి అతన్నొక హోటల్‌కి తీసుకెళ్లి... అతని కేమివ్వాలో తామే ఆర్డరు చేశారు. టిఫినూ, కాఫీ అవడమేమిటి, తనేమడుగుతున్నా వినిపిం చుకోక ఒక మీటింగ్ హాలుకి లాక్కుపోయారు.

అప్పటికి సరిగ్గా తొమ్మిదవుతోంది. తనచు ట్టూ ఏదో ప్రపంచం.. కొత్తది.. తానెన్నడూ ఎరగనిది. వేదిక మీద – సెక్రటరీ నంటూ పరిచయం చేసుకుని... అధ్యక్షులనీ... కవి గారిని మరో యిద్దరినీ పిలిచాడొకడు. ఇక

మొదలయింది ఉపన్యాసాల పరంపర. కవి గారికి సన్మానమంటూ దుశ్శాలువ కప్పారు. సన్మాన పత్రం చదివారు. దుశ్శాలువ కప్పుకున్న కవిగారు దుశ్శాసనుడిలా–వందన సమర్పకుడికి కూడా సమయం మిగల్చకుండా తన కవిత్వం గొప్పతనమూ.. తన గొప్పతనమూ మైకులో మార్మోగించేశాడు. అది– ఉపన్యాసం కాదు... కవిగారి ఆత్మస్తుతి. అప్పుడప్పుడూ పరనింద. ప్రేక్షకుడికి కొంచెమైనా బాగున్నదనిపించినది – మధ్యలో యిచ్చిన తేనీరు మాత్రమే. కవిగారి వాగ్ధాటికి – కరుణకుమార్ వడదెబ్బ తగిలినట్లు సొమ్మసిల్లి పోయాడు కుర్చీలో. ఇంతకంటే సెల్‌లోనే నయం. తన మాటలు వినడానికి మనిషిలేకపోయినా తను మరొకరి మాటలు వినక్కర్లేదు. ఫొటోలు... జ్ఞాపికలు... వీడియో... కలలోలా ఉంది కరుణకుమార్‌కి.

పదకొండున్నరకి మరెవరో గుంపుగా వొచ్చి వేదికమీంచి కవిగారిని తప్ప మిగిలిన వారందరినీ లాగేసినంత పనిచేసి.. అలాగే అవతలి సంఘం వారిని బయటకు నెట్టేసి – తామాక్రమించారు. రెడ్డొచ్చి మొదలాడమన్నట్లు – పేర్ల మార్పిడితో అధ్యక్షుడి స్వాగత వచనాలు, కవి

## AVM లిటిల్ స్టోరీస్



నిరుద్యోగి మహర్షి సముద్రం ప్రక్కనే వున్న ఇసుకతిన్నెల మీద నడుస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. కాలుకి ఏదో తగిలి ముందుకు పడబోయి, తమాయించుకుని, అది ఏమిటా అని వెనుదిరిగి చూసాడు. కళ్లు మెరిసాయి. ఏదో ఇత్తడి వస్తువులా ఉంది. చాలా భాగం ఇసుకలో ఉంది. చుట్టూ వున్న ఇసుకను తొలగించి చూసాడు.

తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. అది తను చిన్నప్పుడు కథల్లో చదివిన అల్లావుద్దీన్ అద్భుతదీపం లాంటిది. కథలో మాదిరిగా దీపంమీద మూడుసార్లు రుద్దాడు! దీపంలోనుంచి బుసబుస పొగలు వచ్చాయి. పొగల మధ్యలో భూతం ఉందిగాని, అది భయంకరంగా లేదు, మనిషికన్నా ఎత్తుగానూ లేదు. మహర్షికి అనుమానం వచ్చింది.

"నీ అనుమానం నిజమే. నేను అప్పటి భూతాన్నే. కొన్నివేల సంవత్సరాలు అయ్యేసరికి చిక్కిపోయాను. నా పవర్స్ కూడా తగ్గాయి. ఒకే ఒక్క వరం ఇస్తా... కోరుకో" అంది భూతం.

ఇప్పటి మహర్షికి తెలివితేటలు తక్కువెందుకుంటాయి!?

"ధనవంతురాలూ, అందమూ ఉన్న, భర్త చెప్పిన మాట విని చెప్పు క్రింద ముల్లులా పడివుండే భార్యని ప్రసాదించు" అన్నాడు తెలివిగా!

"అవన్నీ నాకు కుదరవు గానీ ముల్లులాంటి గొప్ప అందగత్తెను ఇస్తున్నాను. తీసుకో... దానికి కాపలా కాస్తూ, నీ ఖర్మ అనుభవించు" అంటూ భూతం ఆకాశంలో కలిసిపోయింది.

గారిని ప్రశంసించడం... సన్మానం... ఫొటోలు... మామూలే. ఈసారి కరుణకుమార్‌ని కాపలా కాస్తున్నట్లు అటుపక్కా యిటుపక్కా కూర్చున్న వారు మాత్రం మారారు. అతను నిద్రపోకుండానూ... ఉపన్యాసాలు వినకుండా మరో లోకంలోకి పోకుండానూ ఉండీ ఉండీ మోచేత్తో పొడుస్తూండకపోతే... 'శ్రీనాథుడు నాకంటే ముందు పుట్టబట్టి కానీ... లేకపోతే నేనే అతని కంటే గొప్పవాడినయ్యే వాడిని' మొదలయిన మాటలతో కవిగారి ఆత్మస్తుతీ, స్వోత్కర్షా, అహంభావపు ప్రగల్భాలా రెండోసారి కూడా వినవలసి వచ్చినందుకు - పుంజాలు తెంపుకుని పారిపోయేవాడు. వినడంలోని కష్టం బాగా తెలిసి వొస్తూందతనికి. చస్తున్న పాముని కొడుతున్నట్లే అనిపించింది - అట్టే తేడా లేకుండా సాగిన కవిగారి ఉపన్యాసం... కవిగారి దెబ్బకి కరుణకుమార్ జీవచ్ఛవమే ఐపోయాడు. వొంటి మీద దెబ్బల కంటె చెవుల్లో దూరే మాటలే దుర్భరమని అతనికి పూర్తిగా తెలిసివొచ్చింది.

ఒంటిగంట దాటాక టీ యిస్తే అది తాగడానికి కూడా అతనికి శక్తి చాలలేదు. ఈసారి మరోగుంపు వొచ్చి వేదిక నాక్రమించింది. కరుణకుమార్ బాడీగార్డులు మారారు. మళ్లీ... అదే కవిగారు... అవే ఉపన్యాసాలు... శ్రీశ్రీ కంటే తనే గొప్పవాడినని స్వంత డబ్బా... కవిగారికి సన్మానపత్రం... సన్మానం... కవిని పొగడడం... వినలేక కుర్చీలో వెనక్కి వాలిపోయాడు కరుణాకర్. అతనికి తెలివొచ్చేసరికి.

"కవిగారిమీటింగుంది... పద" అన్నారు జడ్జిగారు. ఆయనకి కొంచెం దూరంలో ఎస్సయ్.

"వొద్దొద్దు. అది తప్ప మరేదయినా. ఆ సెల్‌లోనే చాలానయం... సభలో కంటే."

"ఎందుకని?"

"ఆ స్వంత డబ్బా... బాబోయ్... వొద్దు..." దణ్ణం పెట్టేశాడు కరుణకుమార్. "అది వినడం కంటే ఏదేనీ సరే నయమే." ఏడిచినంత పని చేశాడు.

"మరి... ఒక్కరోజుకే యిలా ఐపోతున్నావే! నీ భార్య ప్రతి రాత్రీ నువ్వుతాగి వాగే మాటలకి ఎంత నరకం అనుభవిస్తూండాలీ? ఈ ఫిర్యాదు చదువ్."

"క్షమించండి సార్. నా బుర్ర చెడిపోయింది. నేను చదవలేను... ఏమీ చెయ్యలేను. మనిషి మాటలు వినడమంటేనే ఒళ్లు కంపర మెత్తుతోంది-" ఏడిచేశాడు కరుణకుమార్. "ఇక నేను అనవసరంగానూ, అవసరంగానూ కూడా ఒక్క మాట కూడా ఎక్కువ మాట్లాడను."

"క్షమిస్తున్నాను. ఈ బైండోవర్ మీద సంతకం చెయ్యి. ఎస్సయ్ గారూ, అతనేం చేయకూడదో చెప్పండి. అతిక్రమిస్తే... యీసారి రాజకీయ నాయకుల ఉపన్యాసాలు వినవలసి ఉంటుందని హెచ్చరించండి."

"యస్ సార్... కానీ... యిదంతా ఏమిటో నాకర్థం కావడంలేదు... మీరు చెప్పినట్లు చేశానే కాని-"

"చట్టం పరిధిలోకి వొస్తుందో రాదో అనిపించేలాంటి చిత్రహింసకి గురి చేస్తున్నాడితను తన భార్యని ప్రతిరాత్రీ. తాగి... వాగుతూ ఆవిడ బుర్ర తినేస్తున్నాడని ఆమె మొరపెట్టుకుంది. చిత్రహింసకి మామూలు శిక్ష తగదని - చీకట్లో బాణం వేసి చూశాను. లక్ష్యం నెరవేరింది. అది ఆవిడ అదృష్టం. కోర్టుకి రానక్కర్లేకుండానే కేసు విజయవంతంగా న్యాయబద్ధంగా ముగిసింది. ఫిర్యాదు చదవండి. అదే అర్థమౌతుంది" అని నవ్వారాయన.